వరుడి తరపున ఎన్నో పెళ్లి సంబంధాలు చూశారు. ఒక సంబంధం నచ్చిందనుకున్నారు. అందరికీ 'అన్ని విధాలా' అది అనుకూలమైనదనే నిర్ణయానికి వచ్చారు. కానీ వున్నట్లుండి వధువు మరోసారి వరుణ్ణి చూడాలనీ, ఈ సారి తనను చూడ్డానికి ఒంటరిగానే రావాలనీ కబురు పంపించింది. జంకుతూనే ఆ ఇంట్లోకి... ఆమె గదిలోకి... అడుగు పెట్టాడు కథానాయకుడు. ఆ తర్వాత...?

# పెళ్ళయింది!

— కందుకూరి వెంకటమహాలక్ష్మి



'ఏమే కమలా... నీ అభిప్రాయమేమిటి?'

"నా అభిప్రాయానికేముంది! పిల్ల చూడ్డానికి బాగానే వుందనుకో! 'కాస్త పొడుగ్గావుంటే బాగుండేదేమో' అనిపిస్తోంది. వీడేమో ఆరడుగుల మనిషాయె—ఆ పిల్ల వీడి భుజాలక్రిందకుంటే చూసే వాళ్లకెలా వుంటుంది?"

"అంతెందుకు—రేపు పెళ్లిలో ఆ అమ్మాయిని ఏ ముక్కాలిపీటో వేసి నిలబెడితేనే గానీ ఫోటోల్లో ఆ పిల్ల కనవడదు"

"సరిగా చెప్పేవే లతా!"

"అదికాదే అక్కా! అన్నయ్య జాతకంలో అసలు పెళ్లయ్యే యోగ్యత వుందో లేదో చూపించండి! క్రితంసారి చూసిన అమ్మాయేమో వీడికంటే పొడుగ్గా, గెడకర్రలావుంది. ఈ పిల్లేమో పొట్టిబుడంకాయ. అతి వృష్టి, అనావృష్టి."

"అరుణ చెప్పిందీ నిజమే! ఓసారి వాడి జాతకం ఎవరికైనా చూపించండి! ఇప్పటికే అన్నయ్యకి ముప్ఫై ఏళ్ళుదాటిపోయాయి. ఇన్ని సంబంధాలు చూసి, చూసి ఆఖరికి అలాంటి తాడిచెట్టునో, మట్టగిడసనో కట్టబెడితే లోకం ఏమంటుంది? పెళ్ళవక ఆఖరికా సంబంధం చేసారనో, డబ్బుకి కట్టబెట్టారనో హేళన చేస్తారు!"

"బాగుందిరా నీసొదా! వూరుకో నరేంద్రా! ఎవరేనా వింటే నవ్విపోతారు! మొగపిల్లాడన్నాక ఓ పది సంబంధాలు చూడ్డం తప్పా? ఊళ్ళోవాళ్ళకేం పోవాలి? ఏదో వాగుతారు నోటికొచ్చింది! వాళ్లకోసం మనకి నచ్చని సంబంధం కట్టబెడతామా? అందులో ఇంటికి పెద్ద కోడలాయె! అన్నివిధాలా నచ్చితేనే చేసుకుంటాం. మగ పిల్లవాడు-వాడికేమిటి? ముప్ఫైదాటినా ఫరవాలేదు, నలభై దాటినా ఫరవాలేదు. నా కొడుక్కి రాజాలాంటి ఉద్యోగం. ఇప్పటికే బోలెడు సంబంధాలొచ్చాయి."

"అది కాదే అమ్మా! ఈ నరేంద్రగాడు—చూసిన మొట్ట మొదటి సంబంధమే కుదిర్చేసుకుంటాడు లాగుంది! చూద్దాం, చూద్దాం!!"

"నాన్నా... నువ్వలా ఏం మాట్లాడకుండా కూర్చున్నావేమిటి? ఈ వారంలో చూసిన ఏడింటిలో ఏది ఫరవాలేదంటావు?"

"ఏదని చెప్పమంటావు? విశాఖ సంబంధం నీకు నచ్చలేదు. తణుకుది మీ అమ్మకి నచ్చలేదు. రాజమండ్రిది నరేంద్రకి నచ్చలేదు. ఏలూరుది బాగానే వుంది గానీ కట్నం బొత్తిగా తక్కువ. హైదరాబాద్ అమ్మాయిని చూడగానే 'రోడ్ రోలర్' అని అరుణ కామెంట్ చేసిందాయె! విజయవాడ పిల్ల రమణకంటే పెద్దదానిలాగుందని, ముఖం ముదర టంగణంలా వుందని లత అంటోంది—ఇంక ఇవాళ చూసొచ్చిన కాకినాడ సంబంధం గురించి అప్పుడే మీరంతా తేల్చేశారు కదా?"

"అది కాదు నాన్నా! రోడ్డురోలరని నేనన్నానంటారు గానీ, వాళ్లు బొత్తిగా లాంఛనాలు పది వేలలో జరుపుకోమని అన్నారు కదా! ఈ రోజుల్లో పదివేలకి ఏం వస్తాయి చెప్పండి?"

"అవును నాన్నా! వెయ్యిరూపాయలు పెడితే ఓ మోస్తరు కంచిచీర వస్తోంది. మా ముగ్గురికి, అమ్మకి లాంఛనాలకీ, అప్పగింతలకీ రెండేసి చీరలు కావాలా? అవే ఎంతవుతాయో చూడండి!"

"మరి నేను ఎప్పటినుంచో అన్నయ్య పెళ్ళిలాంఛనాల డబ్బుతో జూకాలు చేయించుకోవాలనుకున్నాను. అక్క చెప్పినట్లు వాళ్ళిచ్చేది చీరలకే సరిపోదు. ఇంక లాంఛనాలప్పుడు బంగారం ఏం కొనుక్కుంటాం? కనీసం ఖరీదుల్ని బట్టి లాంఛనాల డబ్బు పెంచొద్దూ?!"

"అందుకే వాళ్ళకి—లాంఛనాలు మీరే జరిపించమనీ, కాళ్ళు కడిగే పళ్ళెం, చెంబు, బిందెలు స్టీలువి, ఆడబిడ్డలు, వియ్యపురాలికి లాంఛనాలప్పుడు వెండి బొట్టు పెట్టెలు, తలో కాసు, పదిహేనేసి వందలరూపాయల వెండి జరీ చీరలు, అప్పగింతలప్పుడు వెయ్యేసి రూపాయల చీరలు, పడిగట్టు వెండి గిన్నెలు రెండూ పాతిక తులాలవి మాకు, మిగతా మగవాళ్ళకి అప్పగింతలప్పుడు టెర్రీకాట్ బట్టలు పెట్టాలనీ, ఇక మీ అల్లుడికేం పెట్టుకున్నా మీ ఇష్టమనీ రాశాముగా!"

"బాబోయ్! నాకు అప్పగింతలప్పుడు పేంటూ, షర్టూవద్దే! నాకొచ్చేది అప్పుడేకదా? నూటు యిస్తేగానీ ఒప్పుకోను."

"ఇచ్చే ఉద్దేశంవుంటే ఈ పాటికి జవాబు వచ్చేది కదా? బొత్తిగా పిసినిగొట్టు వాళ్ళల్లాగున్నారు—అయినా అందరికీ మనలా ముద్దూ ముచ్చట్లూ వుండొద్దూ!"

"అదికాదర్రా... మన పక్కింటి మహాలక్ష్మిగారి అదృష్టం చూడండి! వాళ్ళబ్బాయికి ఏం పెద్ద పొడిచేసే ఉద్యోగమనీ! యాభైవేలు కట్నం, ఇరవైవేలు లాంఛనాలకీ యిచ్చారుట. అదీకాక వాళ్ళకి ఆడపిల్లలేనట. తరవాత లక్షరూపాయల ఆస్తి, యాభైకాసుల బంగారం కూడా వస్తుందట! ఎలా పడతారోవాళ్ళు! ఎంతయినా దేవాంతకురాలు తల్లీ! ముహూర్తాలు పెట్టీగానీ ఎవ్వరికీ చెప్పలేదు. చెడగొడతారని భయం అనుకుంటాను."

"మనవాడికీ అలా ఆస్తితో పిల్లొస్తే కట్నం గురించి పెద్దగా పట్టించుకోకపోదుము. ఆ పిల్ల తెచ్చే ఆస్తితో మన అరుణ, లతల పెళ్ళిళ్లయిపోతే చాలు."

"అయినా ఆవిడది బుర్రలు మార్చే తెలివిలెండి! మనకెలా వస్తాయా తెలివితేటలు? అన్నట్లు నిన్న రామవయ్యగారేదో సంబంధం గురించి చెప్పారు కదండీ! పిల్ల ఉద్యోగస్తురాలనీ, రెండు వేల దాకా తెస్తోందనీనూ... అది చూడ్డానికి వస్తామని కబురు చెయ్యండీ!"

పెళ్ళి చూపులనుంచి వచ్చి, బట్టలు మార్చుకుని గదిలో మంచం మీద పడుకున్న రమణకి—అక్క కమల, చెల్లెళ్ళు అరుణ, లత, తమ్ముడు రవీంద్ర, తల్లీ, తండ్రి చెప్పుకుంటున్న మాటలన్నీ వినబడుతున్నాయి.

తనకీ ఉద్యోగం వచ్చిన దగ్గరనుంచీ యిప్పటికి సుమారు ముప్పై సంబంధాలు చూశారు. ఇంతవరకూ ఏ పెళ్లి కూతురి గురించి ఇంట్లో ఏ ఒక్కరూ తన అభిప్రాయం అడగలేదు. పెళ్లి చూపులనుంచి వచ్చిరాగానే అంతా సమావేశమై—ఆ పెళ్లికూతురికో, ఆ ఇంట్లో వారికో ఏవేవో వంకలు పెట్టి ఆ సంబంధాన్ని తోసివుచ్చేవారు. అందులో ఒకరికి నచ్చింది మరొకరికి నచ్చేదికాదు. ఒకరికి పిల్ల నచ్చితే మరొకరికి కుటుంబంనచ్చక, ఒకరికి కట్నం సరిపోకపోతే మరొకరికి లాంఛనాలు సరిపోక... సంబంధాలన్నింటినీ తప్పించేస్తున్నారు. కొన్ని కొన్ని సంబంధాలనయితే మళ్ళీ మళ్ళీ వెళ్ళి చూసి ఏవో వంకలు పెట్టి వస్తున్నారు.

రమణది సహజంగా మెతక స్వభావం. తన మనసులో వున్నదికూడా ఎవరికీ చెప్పలేని పిరికి మనస్తత్వం. అది అలుసుగా తీసుకుని పెద్దా, పిన్నా కూడా అతన్ని ఖాతరు చెయ్యకుండా ప్రవర్తిస్తున్నారు. లోలోపలే బాధపడే రమణ, పైకేమీ అనలేక, అశక్తుడిలా వింటూవూరుకునేవాడు.

ఇతని పెళ్లి చూపుల గురించి వూళ్ళో చాలా మందికి తెలిసింది. రమణ స్నేహితులు అతను కనపడగానే ఆటపట్టించి ఏడిపించేవారు.

"ఏమిటోయ్! మీనాన్నకి కట్నం, మీ అమ్మకి ఆస్తి, మీ అక్క చెల్లెళ్లకి లాంఛనాలూ, మీ తమ్ముడికి సూట్లూ ఇచ్చే పిల్ల దొరికి నీ పెళ్ళయ్యేనాటికి నీకింకో ముప్పైయ్యేళ్లు దాటతాయేమో చూస్కో! బెండకాయ ముదిరినా, బ్రహ్మచారి ముదిరినా... అన్న సామెత మర్చిపోకు. అయినా పెళ్ళాడేది నువ్వా? నీవాళ్ళా?! మరీ అంత వాజమ్మవయితే ఎలాగోయ్!" అంటూ వేళాకోళం చేసే స్నేహితుల ముందు తలెత్తుకోలేక ఇంట్లో తన వాళ్ళని ఎదిరించలేక నలిగిపోసాగాడు రమణ.

'ఈసారి పెళ్ళి చూపులకు వెళ్ళేముందే అన్ని విషయాలూ తెల్సుకుని, నచ్చితేనే పిల్లను చూస్తానని చెప్పాలి' అనుకున్నాడు.

ఆ ప్రకారమే జరిగింది కూడా—పెళ్ళి చూపులకు వెళ్ళేముందే పెళ్ళికూతురు అన్నగారొచ్చి, అక్క చెల్లెళ్లు అడిగిన లాంఛనాల్విడానికి, తండ్రి అడిగిన కట్నమివ్వడానికి, ఆ పైన తల్లికున్న ఆస్తిలో సగం వాటా పెళ్ళి క్లైములో రాసివ్వడానికి ఒప్పుకున్నాడు. పైగా పెళ్ళికూతురు ఎం.ఎ.బి.యిడి చేసి పబ్లిక్ స్కూల్లో రెండువేలు తెచ్చుకుంటోందని చెప్పాడు.

పెళ్ళిచూపులయ్యాయి. అన్నీ నచ్చినట్లే పిల్లకూడా అందరికీ నచ్చింది.

ఇంటికొచ్చిన దగ్గరనుంచీ అక్క చెల్లెళ్ళు తల్లీ తండ్రీ, తమ్ముడూ ఒకటే హడావిడి పడిపోతున్నారు. వాళ్ళు కొనుక్కోబోయే నగలు, చీరల గురించి ప్లాన్లు వేసుకోసాగారు. పెళ్లిలో ఆడబిడ్డలమంటూ ఎలా బిడియపడాలో, ఎలా అలగానో, ఏ క్లైమప్పుడు ఎలా నడుచుకోవాలో ఒకరికొకరు చెప్పుకుని నవ్వుకోసాగారు. నవ్వులు, కేరింతలతో తెగ హడావిడి పడిపోతున్నారు. ఎవరి ముఖంలో చూసినా ఆనందపు ఛాయలే! ఇల్లంతా నవ్వుల పువ్వులే!!

వీళ్ళ అంగీకారం తెలిపిన మర్నాడే ఆడపెళ్ళివారింటినుంచి వచ్చింది కబురు. 'అమ్మాయి పెళ్ళికొడుకుని సరిగా చూడలేదుట. ఓసారి అతన్ని మాత్రం పంపిస్తే ఏకాంతంగా ఒకరినొకరు చూసుకుంటారట.' అదీ ఆ కబురు సారాంశం. ఒక్కడిని పంపమనడం మొదట నచ్చక ముఖాలు ఓ మోస్తరుగా పెట్టినా, మిగతా లాంఛనాలన్నీ నచ్చినప్పుడు ఓసారి వెళ్ళొస్తే పోయేదేమిటనీ, కాదంటే మళ్ళీ యిలాంటి సంబంధం రాకపోవచ్చున్న భయంతోనూ వెళ్ళి రమ్మన్నారు రమణని.

* * *

**హా**ల్లోకి అడుగెట్టిన రమణని సాదరంగా ఆహ్వానించాడు ఆ ఇంటి బంట్రోతు. "బాబూ! అమ్మాయిగారు—మీరొస్తే పంపమన్నారు. అరు మేడమీదున్నారు. అమ్మగారూ, అన్నయ్యగారూ వూరెళ్లారు" అన్నాడు.

రమణకేమీ అర్థం కాలేదు. తడబడుతున్న అడుగులతో మేడమీదకి వెళ్ళాడు.

గదిలో నవ్వులూ, కేకలూ వినపడటంతో రమణ గదిబైటే ఆగి తలుపు తట్టాడు.

తలుపు తెరిచి 'రండి, రండి'! అంది పెళ్ళికూతురు గిరిజ. పక్కనే కూర్చున్నారు మరో నలుగురమ్మాయిలు. గిరిజ వాళ్ళని తన స్నేహితులు 'హేమ, బిందు, నీల, కవిత' లని పరిచయం చేసింది. వాళ్ళందరినీ ఎక్కడో చూసినట్లనిపించింది రమణకి. అందరికీ ప్రతి నమస్కారం చేసి ఓ కుర్చీలో కూర్చున్నాడు.

ఓ ఐదు నిమిషాలు నిశ్శబ్దం ఆవరించిందా గదిలో. నెమ్మదిగా తలెత్తిన గిరిజ 'నాకుమీరు నచ్చారు' అంది. ఆ వెంటనే హేమ, బిందు, నీల, కవితలు "మాకూ నచ్చారు" అన్నారు.

'అదేమిటి?' అన్నాడు అయోమయంగా రమణ.

"ఏమీలేదండీ! మేం ఐదుగురం మిమ్మల్ని పెళ్ళి చేసుకుంటాం" అంది గిరిజ.

"మీరనేదేమిటో నాకు అర్థం కావటం లేదు" అన్నాడు కంగారుపడిపోతూ.

"పాపం చంటబ్బాయిగారికి అర్థం కావటంలేదుట. విడమర్చి చెప్పవే గిరిజా!" అంది హేమ.

"అవునే... అమ్మ అడ్డాల్లో బిడ్డకదా! ఎలా అర్థం అవుతుంది? ఇంకా నోట్లో వేలేసుకుని కూర్చేబట్టే, వాళ్ళ నాన్న సంతలో గేదెని బేరం పెట్టినట్లు పెడుతున్నా మాట్లాడటం లేదు మరి!" అంది బిందు.

"నిజమే మరీ యింత మొద్దబ్బాయి కాబట్టే చెల్లెళ్ళూ, తమ్ముడూ కూడా కోతినాడించినట్లు ఆడిస్తున్నారు." అంది నీల.

అంతా ఘొల్లుమన్నారు.

రమణ పరిస్థితి అధ్వాన్నంగా తయారయింది. పైన పంకా వేగంగా తిరుగుతున్నా చెమటలు పోసేస్తున్నాయి. గొంతు తడారిపోతోంది. తలకొట్టేసినట్లుంది. ఏం చెయ్యాలో తెలీటం లేదు. వాళ్ళు ఐదుగురూ, తనొక్కడూ. ఉక్రోషంతో వారికేసి చూసి "మీకేమన్నా పిచ్చెక్కిందా? నన్నెందుకు పిలిపించారు గిరిజగారూ?" అన్నాడు కోపంగా.

"ఇందుకేనండీ... 'మేం ఐదుగురం పెళ్ళి చేసుకుంటాం.' అనిచెప్పడానికే" అంది కవ్విస్తూ.

"ఐదుగుర్నీ చేసుకోవడం ఏమిటి? పెళ్ళి చూపులప్పుడు చెప్పలేదేం? పైగా మీ అన్నయ్య వచ్చి మావాళ్ళడిగినవాటికి 'సరే' అన్నాడుట"

"అవునండీ! 'సరే!' అన్నాడు. అనలేదనటంలేదుగా. మరి మీ అక్క చెల్లెళ్ళకి, మీ అమ్మకి పాతిక వేలు

లాంఛనాలు, మీ నాన్నకి యాభైవేలు కట్నం, మీ తమ్ముడికి సూటూ, మీ అమ్మగారికి లక్షరూపాయల ఆస్తి కావాలి. వంటా వార్పూ రావాలి. పైగా ఉద్యోగస్తురాలయి వుండాలి కదా? ఇవన్నీ ఒక్క పెళ్ళికూతురిలోనే ఎలా అమురుతాయి? ఒక్కళ్ళే ఎలా తీర్చగలరు? ఇదివరలో మీరు మా స్నేహితురాళ్ళు నలుగుర్నీ చూసి మీ కోరికల్లో ఏదో ఒకటి తక్కువయిందని వెళ్ళిపోయారట. మొన్న నా పెళ్ళి చూపులు మీతో అని చెప్పగానే వీళ్ళంతా నాకు మీ వాళ్ళ కోరికల గురించి ముందే చెప్పారు. సో—నా ఒక్కదానివల్లా మీ వాళ్ళందరి కోరికలూ తీరవు. అందుకు మీరు మా ఐదుగుర్నీ పెళ్ళాడితే ఒక్కొక్కరి వల్ల ఒక్కో కోరిక మీ ఇంట్లో వాళ్ళందరివీ తీరతాయి. నేనేమో ఉద్యోగస్తురాలిని. జీతం తెచ్చి పోస్తాను. హేమ మీ నాన్నడిగిన కట్నం తెస్తుంది. బిందు మీ వాళ్ళడిగిన లాంఛనాలు తెస్తుంది. నీలేమో ఆస్తిమంతురాలు. లక్ష రూపాయల ఆస్తితో వస్తుంది. కవితకేమో వంటావార్పూ బాగా వచ్చు. ఇంట్లో వంటలక్కలా బాగా బండచాకిరీ చెయ్యగలదు.

"ఇకపోతే మీరేమో సొంత భావాలు లేని ఓ మగమనిషని చాలామంది చెప్పారు. ఇప్పుడు మీ వాళ్ళ చెప్పు చేతల్లో నడుచుకుంటున్నారు. పెళ్ళయ్యాక మా అడుగు జాడల్లో నడుస్తారు. మాకు కావలసిందీ మీలాంటి భర్తే! అందుకు మా అందరికీ మీరు చాలా నచ్చారు. ఇవిగో వనువు కొమ్ములు కట్టిన తాళ్ళు రెడీగా వుంచాం. మీ వాళ్ళందరి కోరికల మేరకీ చెక్కులు రాసిస్తాం. ముందీ వనువుకొమ్ములు వుస్తెలనుకొని మీరు కట్టించేసుకోండి!" అని ఐదుగురూ చుట్టు ముట్టడంతో కంగారుగా లేచి, ఒక్క దూకుని వాళ్ళని తప్పించుకుని, మేడదిగి పరుగు లాంటి నడకతో వీధిలోకి వచ్చిపడ్డ రమణకి మేడమీద వాళ్ళు ఐదుగురు వేస్తున్న జోకేలు, నవ్వులూ వినపడుతూనే వున్నాయి.

రోడ్డుమీద నడుస్తున్న రమణ శరీరం కాగడాలా కాలిపోతోంది. 'ఛీ ఛీ! ఇంట్లోవాళ్ళకే కాకుండా ఊళ్ళో అందరికీ కూడా ఈ పెళ్ళి చూపుల వల్ల ఎంత లోకువయిపోయాను? నిజమే... నా చేతకాని తనంవల్లే అందరి ముందూ యింత చులకనయిపోయాను. ఎందుకొచ్చిన బ్రతుకునాది? ముప్పై ఏళ్ళు దాటాయి. మూడువేలు గడించుకుంటున్నాను. అయినా స్వతంత్రంగా ఓ నిర్ణయం తీసుకోలేని స్వభావంనాది. నా మెతకతనమే నన్నీ స్థితికి దింపింది. ఈనాడింత అవమానంపాలు చేసింది. మా ఇంటి సంగతులు తెలిసే గిరిజా, వాళ్ల అన్నయ్య, ఆమె స్నేహితులూ తనకి బుద్ధి చెప్పడానికి యిలా చేశారన్న మాట.'

* * *

చి॥రమణకి! అనకాపల్లి జమీందారుగారి అమ్మాయిని చూసుకోడానికి రమ్మని కబురు చేసారు. వెంటనే రెండు రోజులు సెలవు పెట్టి రావలసింది. అంతా కులాసా.

ఇట్లు
మీ నాన్న

అన్న ఉత్తరానికి బదులుగా వస్తున్నట్లు జవాబురాశాడు రమణ.

రమణ రాసిన ఉత్తరం చూసి పెళ్ళివారికి కబురు పంపి, సాయంత్రం అతని రాకకి ఎదురుచూస్తున్నారు కాంతయ్య కుటుంబసభ్యులు.

ఇంటిముందు టాక్సీ ఆగింది. అందులోంచి సూట్‌కేసు పట్టుకు దిగాడు రమణ. ఆ వెనకే దిగింది ఓ పాతికేళ్ళ అమ్మాయి.

"ఎవరా??!!" అని ఆమెని చూస్తూ రమణని పలకరించడమే మర్చిపోయారంతా.

"రా రాధా! మీ అత్తగార్కి, మామగార్కి నమస్కారం చెయ్యి!" అంటూ చెయ్యిపట్టుకుని తీసుకొచ్చి "మీ కోడలు. నాతోటి ఉద్యోగస్తురాలు. మొన్ననే మేము రిజిస్టరు మేరేజ్ చేసుకున్నాం!" అంటూ కాంతయ్య దంపతుల కాళ్ళకి దణ్ణం పెడుతున్న రాధా రమణుల్ని చూస్తూ కొయ్య బొమ్మల్లా నిలబడిపోయారా ఇంట్లో ప్రతీ ఒక్కరూ! □


**Statement about ownership of VANITHA (Telugu)**
**Rule 8 (Form VI), Newspapers (Central) Rules, 1956**

| | |
|---|---|
| *1. Place of Publication* | ... 'CHANDAMAMA BUILDINGS' 188, N.S.K. Salai Vadapalani, Madras-600 026 |
| *2. Periodicity of Publication* | ... MONTHLY<br>... 1st of each calendar month |
| *3. Printer's Name* | ... B.V. REDDI |
| *Nationality* | ... INDIAN |
| *Address* | ... Prasad Process Private Limited 188, N.S.K. Salai Vadapalani, Madras-600 026 |
| *4. Publisher's Name* | ... B. VISWANATHA REDDI |
| *Nationality* | ... INDIAN |
| *Address* | ... DOLTON PUBLICATIONS 188, N.S.K. Salai Vadapalani, Madras-600 026 |
| *5. Editor's Name* | ... B. VISWANATHA REDDI |
| *Nationality* | ... INDIAN |
| *Address* | ... 'Chandamama Buildings' 188 N.S.K. Salai Vadapalani, Madras-600 026 |
| *6. Name and Address of individuals who own the paper* | ... DOLTON PUBLICATIONS PARTNERS:<br>1. B.VENUGOPAL REDDI<br>2. B.VISWANATHA REDDI<br>3. B.VENKATRAMA REDDY<br>4. B.N.SURESH REDDI (Kartha of B.L.N. Prasad-HUF)<br>5. B.V.SANJAY REDDY<br>6. B.V.SHARATH REDDY |

I, B. Viswanatha Reddi, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

*1st March 1987*

**B. VISWANATHA REDDI**
*Signature of the Publisher*